

ఖాళీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో సామాజిక, పరివర్తన మార్పు కమ్యూనికేషన్స్ విభాగంలో ఖాళీగా ఉన్న ఒక పోస్టు భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 3.00 గంటల్లోపు westgodavari.ap.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు చూసుకొని దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు కమ్యూనికేషన్స్, పబ్లిక్ రిలేషన్స్, సోషల్ సైన్సెస్, మేనేజ్మెంట్ రంగాల్లో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, ఫిజికల్ రెజ్యూమ్, అన్ని సర్టిఫికెట్లూ ఈ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. అర్హత, ఆసక్తి కలిగిన దరఖాస్తుదారులు జిల్లా కలెక్టర్ వారిచే ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు మౌఖిక పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిఎస్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి అధికారిని సంప్రదించాలని తెలిపారు.

మా పేర్లు నమోదు చేయండయ్యా..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కష్టపడి సాగు చేస్తున్న కౌలురైతుల పేర్లు ఇ-క్రాప్‌లో నమోదు కావు. ప్రభుత్వం అందించే ఏఒక్క సాయమూ వారికి అందదు. చివరికి తాము పండించిన ధాన్యం సైతం తమ పేరు మీద అమ్ముకోవడానికి లేకుండాపోయింది. ధాన్యం తరలింపునకు అయ్యే రవాణా, జట్టు ఖర్చులు సైతం వారికి అందని దుస్థితి నెలకొంది. ఇ-క్రాప్‌లో కౌలురైతుల పేర్లు నమోదు కాకపోవడమే దీనికి ప్రధాన కారణం. రబీకి సంబంధించి ఇ-క్రాప్ నమోదు జరుగుతుండటంతో ఈసారైనా తమ పేర్లు నమోదు చేయండయ్యా అంటూ కౌలురైతులు మొత్తుకుంటున్న పరిస్థితి రెండు జిల్లాల్లోనూ నెలకొంది.

ఇ-క్రాప్ నమోదుపై కౌలురైతుల ఆవేదన
వాస్తవ సాగుదారులు 90 శాతం నమోదుకు దూరం
ఖరీఫ్ ధాన్యం అమ్మకానికి కౌలురైతుల నానావస్థలు
రబీలోనైనా కౌలురైతుల పేర్లు నమోదుకు డిమాండ్
కొల్లేరును ఆనుకుని అనసరి భూముల ఇ-క్రాప్‌పై అధికారుల మౌనం



రెండు జిల్లాల్లోనూ రబీకి సంబంధించి ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ డిసెంబర్ 28వ తేదీ నుంచి సాగుతోంది. ఇ-క్రాప్ నమోదులో కౌలురైతుల పేర్లు ఈసారీ నమోదు చేయకపోవడంపై సాగుదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. సాగు చేస్తున్న కౌలురైతుల పేర్లు కాకుండా భూయజమానుల పేర్లు నమోదు చేయడం ద్వారా తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కౌలురైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల వరకూ వరి సాగవుతోంది. రెండు జిల్లాల్లోనూ 75 శాతం వరిసాగు కౌలురైతులే చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇ-క్రాప్‌లో సాగు చేస్తున్న రైతుల పేర్లు నమోదు చేయాలి. అయితే ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. సిసిఆర్‌సి ఉంటే కౌలురైతుల పేర్లు నమోదు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా ఆ సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. రెండు జిల్లాల్లోనూ దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉండగా సిసిఆర్‌సి కార్డులు అందుకున్న కౌలురైతులు సగం కూడా లేరు. అదీ పదెకరాలు సాగు చేస్తున్న కౌలురైతుకు రెండెకరాలకు మాత్రమే సిసిఆర్‌సి కార్డు ఇచ్చిన పరిస్థితి ఉంది. సాగు చేయని భూయజమానుల పేర్లు ఇ-క్రాప్‌లో నమోదవుతున్నాయి. దీంతో ప్రకృతి వైపరీత్యాలకు పంట దెబ్బతిన్న పరిహారం సైతం భూయజమానికి వెళ్లిపోతుంది. బీమా, బ్యాంకులిచ్చే పంట రుణం సహా అన్ని భూయజమాని జేబుల్లోకి చేరుతున్నాయి. దీనిపై ఎప్పటి నుంచో కౌలురైతులు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు అన్యాయం చేస్తూ భూయజమానులకు కొమ్ముకాస్తున్న పరిస్థితి ఉంది.

పండించిన ధాన్యం సైతం అమ్ముకోలేని దుస్థితి

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం సైతం కౌలురైతులు తమ పేరు మీద అమ్ముకోలేని పరిస్థితికి తీసుకొచ్చారు. ధాన్యం కొనుగోలు అంతా ఇ-క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం సాగిస్తోంది. ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లు నమోదవ్వడంతో పండిన పంటసైతం వారి పేరు మీదే అమ్మాల్సి వస్తోంది. దీంతో ధాన్యం సొమ్ము భూయజమాని ఖాతాల్లోనే జమవుతోంది. గతంలో కౌలురైతులు పంట విక్రయించి కౌలు సొమ్ము భూయజమానికి ఇచ్చేవారు. దిగుబడి తక్కువగా వస్తే ఎంతోకొంత తగ్గించి భూయజమానికి ఇచ్చి బతిమలాడుకునేవారు. ఇప్పుడు అందుకు పూర్తి విరుద్ధంగా సాగుతోంది. భూయజమాని ఖాతాలో సొమ్ము జమ కావడంతో పంట పండినా.. పండకపోయినా పూర్తి కౌలుసొమ్ము తీసుకుని మిగిలిన సొమ్ము కౌలురైతులకు ఇస్తున్నారు. ధాన్యం సొమ్ము జమయ్యే వరకూ పెట్టిన పెట్టుబడికి సైతం వడ్డీ కడుతున్నారు. గడిచిన ఖరీఫ్‌లో ప్రభుత్వం నూతన ధాన్యం కొనుగోలు విధానం తెచ్చింది. దీంతో జట్టు, రవాణా ఛార్జీలు వంటివి సైతం రైతులు పెట్టుకుని ధాన్యం తరలించిన పరిస్థితి నెలకొంది. జట్టు, రవాణా ఛార్జీలు సైతం భూయజమాని ఖాతాల్లోకి చేరుతున్నాయి. ఈ సొమ్ము నిబంధనల ప్రకారం కౌలురైతులకు ఇవ్వాల్సి ఉన్న భూయజమానులు ఇవ్వడం లేదు. గట్టిగా అడిగితే పొలం కౌలుకు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో కౌలురైతుల పరిస్థితి అత్యంతదారుణంగా తయారైంది. ఇ-క్రాప్ నమోదులో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారం కారణంగానే కౌలురైతులకు ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనసరి భూములను ఇ-క్రాప్ చేయరూ..!

ఇ-క్రాప్ నమోదైతేనే ఆ భూమికి సంబంధించి ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. కొల్లేరును ఆనుకుని పట్టాల్లేని అనసరి భూములు ఏలూరు, పశ్చిమగోదారి జిల్లాల్లో వేలాది ఎకరాలు ఉన్నాయి. నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఆకివీడు వంటి మండలాల్లో ఉన్న అనసరి భూముల్లో పెద్దఎత్తున రబీసాగు సాగుతోంది. ఈ భూములకు సంబంధించి ఇ-క్రాప్ నమోదుపై ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు ఎటువంటి ఆదేశాలూ ఇవ్వకుండా మౌనం వహిస్తున్నారు. దీంతో దిగువస్థాయి అధికారులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొల్లేరును ఆనుకుని ఉన్న అనసరి భూముల ఇ-క్రాప్‌పై వెంటనే తగు నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే రబీ ధాన్యం అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి రానుందని ఆందోళన చెందుతున్నారు.



ధాన్యం బస్తాలతో ఆందోళన చేస్తున్న కౌలు రైతులు

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి

ఆచంట వేమవరంలో ధాన్యం బస్తాలతో కౌలు రైతుల ఆందోళన

ప్రజాశక్తి - ఆచంట

ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆచంట వేమవరంలో రోడ్డుపై ధాన్యం బస్తాలతో కౌలు రైతులు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు కూపన్లు ఇచ్చి ధాన్యం పట్టిన తర్వాత టార్గెట్ లేదని రకరకాల కారణాలు చెబుతూ రైతులను వారాల తరబడి ఇబ్బందులు పెట్టడం దారుణమన్నారు. ఇన్ని రోజుల కాలయాపన అనంతరం ధాన్యం కొనుగోలు చేయాలంటే ఏ గ్రామంలో ఎంతమంది రైతులున్నారో, ఎన్ని వేల టన్నుల ధాన్యం ఉందో వివరాలు పైకి పంపాలని, అప్పుడు ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు, రైతుభరోసా కేంద్రాలు ఇ-క్రాఫ్ పేరుతో ఎంతమంది రైతులు ఎంత ఆయకట్టు, ఎన్ని ఎకరాలు వేశారో ముందుగానే నమోదు చేసి, ఎంత దిగుబడి వస్తుందో అంచనా వేసినా రాష్ట్ర ప్రభుత్వం ఇన్ని వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనండని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. టార్గెట్‌తో సంబంధం లేకుండా తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు కొండేటి సత్యనారాయణ, గబ్బల చంద్రశేఖర్, కాండ్రేగుల వీరరాఘవులు, బోళ్ల రామారావు, పసల ప్రసాదరావు, గుబ్బల వెంకట సత్యనారాయణ, గుబ్బల శ్రీను, వీరవల్లి చంద్రరావు, గుడాల వెంకటనారాయణ, గుబ్బల ఏడుకొండలు, కడలి భూపతిరావు పాల్గొన్నారు.

ధాన్యమంతా కొనుగోలు చేస్తాం.. అధైర్యపడొద్దు

జిల్లా జాయింట్ కలెక్టర్ మురళి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఇప్పటి వరకూ 3 లక్షల 66 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ మురళి అన్నారు. ఇప్పటివరకూ కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.746 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా రూ.729 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, ఇంకా రూ.17 కోట్లు చెల్లించాల్సి ఉందని, త్వరలో ఆ సొమ్ము చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమన్వయంతో సమర్థంగా పనిచేసి కొనుగోలులో రాష్ట్రంలోనే జిల్లాకు మొదటి స్థానం తీసుకు రావడం జరిగిందని అభినందించారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం సలహా మండలి జిల్లా అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మురళి మాట్లాడారు. 4,153 మంది రైతుల వద్ద 18,836 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉందని, ఆ ధాన్యమంతా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గోనె సంచులు సొంతంగా వినియోగించుకున్న రైతుల ఖాతాల్లో రూ.1,50,000 జమ చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.లక్ష చెల్లించాల్సి ఉందన్నారు. ధాన్యం ట్రాన్స్‌పోర్టు తీసుకున్న వారి ఖాతాలో రూ.3 కోట్ల 60 లక్షలు రైతులకు చెల్లించడం జరిగిందన్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో 1,97,794 ఎకరాల్లో టి - క్రాప్ బుకింగ్ చేయడం జరిగిందని తెలిపారు. పిఎన్ కిసాన్ పథకంలో జిల్లాలో రైతులు ఇకెవైసి విధిగా చేయించుకోవాలని లేని పక్షంలో పిఎం కిసాన్ కింద వచ్చే నిధులు రైతుల ఖాతాల్లోకి జమ కావని అన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ మురళి

డ్రోన్లు అందించేందుకు సిద్ధం

వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందే విధంగా ప్రభుత్వం ఆలోచన చేసిందని, దీనిలో భాగంగా ప్రతి మండలంలో రైతుల పొలాల్లో ఎరువులు, పురుగు మందులు చల్లేందుకు డ్రోన్లు అందించేందుకు నిర్ణయించిందని జెసి తెలిపారు. మండలాల్లో డ్రోన్ల నిర్వహణకు పైలెట్ శిక్షణ పొందేందుకు గ్రూపులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో మండలానికి కనీసం ఒక గ్రూపునైనా గుర్తించి వారిని శిక్షణకు పంపించాలన్నారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు కైగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు నూతన ప్రక్రియ ద్వారా ధాన్యం డబ్బులు 21 రోజుల్లో రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగితే రైతులకు మంచి జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సభ్యులు కొట్టి కుటుంబరావు, ఉద్దరాజు విజయరామరాజు, సంగాని వడ్డి కాసులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఉండి కృషి విజ్ఞాన కేంద్రం అధికారి మల్లికార్జున్ పాల్గొన్నారు.



బెంగుళూరులో జరుగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభకు ప్రతినిధులుగా హాజరైన ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నేతలు

సిపిఎం సీనియర్ నేత సత్యనారాయణ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - తణుకురూరల్

ఇరగవరం మండలం కొత్తపాడు గ్రామం సిపిఎం సీనియర్ నాయకులు బొంతు సత్యనారాయణ మృతి కుటుంబానికి, పార్టీకి, ప్రజా ఉద్యమానికి తీరని లోటని సిపిఎం రాష్ట్ర నాయకులు, మాజీ ఎంఎల్ఎ ఆర్ఎస్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్యనారాయణ క్రమశిక్షణ గల కార్యకర్త అని, 1982 నుండి పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారని కొనియాడారు. సత్యనారాయణ సుదీర్ఘకాలం వ్యవసాయ కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేసి ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. కేన్సర్‌తో బాధపడుతున్నా పార్టీ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారని చెప్పారు. కొత్తపాడు సర్పంచిగా ప్రజలకు సేవలందించారని పేర్కొన్నారు. సత్యనారాయణ మృతి బాధాకరమని తెలిపారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించి, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం చింతపల్లి లక్ష్మి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.జ్యోతి మాట్లాడారు. ప్రతిసారీ వేతనంలో కొంత బకాయి పెట్టడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని తెలిపారు. దీనిపై అధికారులకు వినతిపత్రాలు అందిస్తే గాని బకాయి వేతనం విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లు ఇప్పటికే తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అన్ని పనులూ ఆశా వర్కర్లతో చేయించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. వారిని పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి సమస్యలపై ఏళ్ల తరబడి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలపై ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. జిల్లా స్థాయిలో ఆశా వర్కర్స్ యూనియన్‌తో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లారెన్స్ కుమారి, వరలక్ష్మి, విజయలక్ష్మి, అమ్మాజీ, రాజేశ్వరి, రేవతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి



మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వరరావు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

రోడ్డు భద్రత విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారి పైన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వరరావు హెచ్చరించారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం భీమవరం రవాణా శాఖ కార్యాలయంలో స్కూల్ బస్సు, కళాశాల బస్సు డ్రైవర్లకు రహదారి భద్రత గురించి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడారు. స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్లందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. పాఠశాలలు, కళాశాల యాజమాన్యాలు ఆరు నెలలకోసారి డ్రైవర్లందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. అనంతరం పాలకొల్లుకు చెందిన శ్రీ రాజవల్లి రాధా రమన్ లయన్స్ హాస్పటల్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరం ద్వారా 130 డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 48 మందికి కంటి చత్వారము ఉన్నట్లుగా గుర్తించి పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ సహకారంతో ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ అల్లూరి లక్ష్మీ పతిరాజు, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్స్ సిహెచ్.వెంకట రమణ, కెఎస్ఎన్.ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందజేయాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని, ఫ్లెక్సీల నిషేధం రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేయాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయి డాక్టర్లు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని సిపిఎం పట్టణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక అమరవీరుల భవనంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం అడ్డగర్ల అజయకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు నేటికీ పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. లబ్ధిదారులు బ్యాంకుల్లో అప్పులు చేసి తన వాటా కింద కూడా డబ్బులు చెల్లించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్లెక్సీలపై నిషేధాన్ని వాయిదా వేసి చిన్నపాటి చిరు వ్యాపారులను ఆదుకోవాలన్నారు. కాలుష్య నివారణ చర్యలు ఉండాలి తప్ప, ఉన్న ఉపాధిని దెబ్బతీయడం అన్యాయమన్నారు. తణుకు పట్టణంలో 30 వేల మంది కార్మికులు ఉన్నా నేటికీ 30 పడకల ఇఎస్ఐ ఆసుపత్రి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో డాక్టర్స్, సిబ్బంది, స్థలం విస్తరణ పెరగాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చేయకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ప్రతాప్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కామన మునిస్వామి, గార రంగారావు, గుబ్బల గోపి పాల్గొన్నారు.

26 నుంచి తణుకులో ప్లాస్టిక్ బ్యానర్లు నిషేధం

ప్రజాశక్తి - తణుకు

ప్రభుత్వ ఉత్తర్వుల అనుసరించి ఈ నెల 26వ తేదీ నుంచి తణుకు పట్టణంలో ప్లాస్టిక్ బ్యానర్లు నిషేధిస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎస్.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్లను నిషేధించిందని తెలిపారు. పట్టణంలో ఎవరైనా ప్లాస్టిక్ బ్యానర్లు తయారుచేసినా, ఉపయోగించినా జరిమానా విధిస్తామని తెలిపారు. బ్యానర్ల తయారీదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే 1986 పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్లు తయారు చేసే వారిపై జరిమానా విధించడంతోపాటు మిషన్ సీజ్ చేయబడుతుందని పేర్కొన్నారు. తయారీదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు జెడ్‌పి ఛైర్మన్ శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని యాళ్లవానిగరువులో పలు అభివృద్ధి పనులకు జెడ్‌పి ఛైర్మన్ కౌరు శ్రీనివాస్ శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో 40 లక్షల రూపాయల చేపట్టనున్న డ్రెయినేజీ, తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేలా ప్రయత్నిస్తామని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ మెంబర్ చెల్లం ఆనంద ప్రకాష్, మైఖేల్ రాజు, చందక సత్తిబాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌ఎకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సూర్యారావుపేట ఏరియాలో కాలువలోకి దిగేందుకు రేవు లేదని, కాలువ పక్కన సీసీ రోడ్డు వేయించాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగ నాథరాజును సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు కోరారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్ర మంలో పాల్గొన్న ఎంఎల్‌ఎకు సూర్యా రావుపేటలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ స్థానికంగా తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కొత్త కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డ్రెయినేజీకి ఇరువైపులా మొక్కలు తొలగించాలని, దోమల బెడద నుండి కాపాడాలని కోరారు. ఇళ్ల స్థలాలు లేనివారికి స్థలాలివ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎ.వెంకటలక్ష్మి, గండి త్రిపుర సుందరి, కె.వెంకటేశ్వరరావు, కర్రి శివరామరెడ్డి, ఆదిరెడ్డి సన్యాసిరావు, కె.శ్రీలక్ష్మి, టి.నర్సిరెడ్డి, జి.జ్యోత్స్న, డి.సుగుణ పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు

కల్వర్టు ఏర్పాటు చేయాలి

గడపగడపకూ మన ప్రభుత్వంలో అధికారులకు ఎంఎల్ఎ ఆదేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

వెలంపేటలోని లేఅవుట్‌కు వెళ్లే డ్రెయినేజీపై వెంటనే కల్వర్టు ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అధికారులను ఆదేశించారు. వెలంపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మూడో రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ మాట్లాడుతూ సంక్షేమ పథకాల సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, గ్రామ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి, వైసిపి నాయకులు గాదిరాజు సాయి రామరాజు, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) పాల్గొన్నారు.

నిజాయతీకి మారుపేరు కృష్ణంరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

స్వయంకృషితో ఎదిగిన వ్యక్తి కేంద్ర మాజీ మంత్రి, రెబల్ స్టార్ కృష్ణంరాజు అని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు అన్నారు. శుక్రవారం కృష్ణంరాజు జయంతిని స్థానిక శ్రీదేవి జానకి థియేటర్ ఆవరణలో రెబల్ స్టార్ జిల్లా కన్వీనర్ చింతపల్లి రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును ఆయన కోసి ప్రజలకు పంపిణీ చేసి మాట్లాడారు. నీతి, నిజాయతీకి మారుపేరు కృష్ణం రాజు అన్నారు. రాజకీయాల్లో, సినీ పరిశ్రమలోనూ ఎంతో ఎదిగి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని దక్కించుకున్న మహోన్నత వ్యక్తి కృష్ణంరాజు అన్నారు. అనంతరం పిహెచ్‌సి రోగులకు, సిబ్బందికి పాలు రొట్టెలు అందజేశారు. కార్యక్రమాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి చిటికెల రామ్మోహన్‌రావు, ఆంద్రాజు రామన్న, బస్వాని ఏడుకొండలు, కలిదిండి కుమార్ బాబు, మామిడి శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలు సుఖశాంతులతో ఉండాలి

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలు సుఖశాంతులతో ఉండాలని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. కాళ్లలో సిఎస్ఐ చర్చి మొదటి ప్రతిష్ట వార్షికోత్సవ ఆరాధన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జుత్తిగ నాగరాజు మాట్లాడారు. అనంతరం ప్రేమ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బంధా విజయ, రెవరెండ్ గంటా దేవా కుటుంబరావు, సంఘ కాపరి సామ్యూల్ సత్యానందం పాల్గొన్నారు.



అన్న సమారాధనలో పాల్గొన్న ఎస్ఐ వీరబాబు, ఉప సర్పంచి నరసింహారావు

మొగల్తూరులో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు దేవత నడివీధి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఇటీవల అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతర ముగింపు సందర్భంగా అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా అన్నదాన కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వీరబాబు, ఉప సర్పంచి నరసింహారావు పాల్గొన్నారు.

యువత క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని మాజీ సర్పంచులు మేళం బన్ను తిరుమనీ లక్ష్మీనరసింహులు సూచించారు. మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి మేళం వారి మెరకలో పేరుపాలెం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో సుమారు 20 జట్లు పోటీ పడ్డాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రథమ స్థానంలో మేళంవారి మెరకకు చెందిన శ్రీరామ యూత్, ద్వితీయ స్థానంలో కెపిపాలెం నార్త్ పంచాయతీ పరిధి బొక్కాగూడెంకు చెందిన మహేష్ ఎలివేన్ జట్లు విజేతగా నిలిచాయి. విజేతలకు నగదు ప్రోత్సాహం, జ్ఞాపికలను అందించారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కాళ్ల

విద్యుత్ తీగలు పడి దొడ్డనపూడిలోని కొత్తచెరువు ప్రాంతంలో మెయిన్ రోడ్డు పక్కన జడ్డు గోపాలకృష్ణ తాటాకిల్లు గురువారం అర్ధరాత్రి దగ్ధమైంది. ప్రమాదం సంభవించే సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో గోపాలకృష్ణ కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. సర్పంచి కొల్లి సుబ్బారావు భాశ్విని ట్రస్ట్ ద్వారా బాధితులకు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని కొల్లి నరసింహమూర్తి చేతుల మీదుగా అందజేశారు.

సిపిఐ పోరుబాట జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఉండి

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు కేటాయించాలని, టిడ్కో గృహాలు తక్షణమే లబ్ధిదారులకు అందించాలని కోరుతూ సిపిఐ చేపట్టిన పోరుబాట విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉండి మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సిపిఐ కార్యాలయంలో పోరుబాట వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు పెరిగిన గృహ నిర్మాణ సామగ్రి ధరకు అనుగుణంగా రూ.ఐదు లక్షలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ జనవరి 17 నుంచి 30 వరకు లబ్ధిదారులతో సంతకాలు సేకరించి ఫిబ్రవరి 6న జిల్లా కలెక్టరేట్ల వద్ద, ఫిబ్రవరి 22న విజయవాడలో ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సిపిఐ చేపట్టిన పోరుబాట ఆందోళనల్లో జగనన్న కాలనీల, టిడ్కో గృహాల లబ్ధిదారులు పాల్గొని విజయవంతం చేయాలని వెంకట్రావు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తమ్మరాని శ్రీను, పతివాడ గణపతి, నమ్మి నాగరాజు, వి.గడ్డియ్య, కోరుకొండ బాపూజీ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల



ఆర్థిక సాయం అందిస్తున్న నరసింహమూర్తి

దొడ్డనపూడి గ్రామానికి చెందిన చెన్నంశెట్టి శివన్నారాయణ పేద కుటుంబానికి భాస్విని ఛారిటబుల్ ట్రస్ట్ సాయం చేసేందుకు ముందుకువచ్చింది. దొడ్డనపూడి గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు స్థాపించిన భాస్విని ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా శివన్నారాయణ వైద్య నిమిత్తం రూ.ఐదు వేలు అందించారు. సర్పంచి కొల్లి సుబ్బారావు తండ్రి కొల్లి నరసింహమూర్తి చేతుల మీదుగా శివన్నారాయణకు ఆర్థిక సాయం శుక్రవారం అందించారు.

'బేడ, బుడగ జంగాల సమస్యలను పరిష్కరించండి'

ప్రజాశక్తి - ఉండి

బేడ, బుడగ జంగాల కులాలకు కుల ధ్రువీకరణ పత్రాలను అందించి, సమస్యలను పరిష్కరించాలని బేడ, బుడగ జంగాల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఇంగువ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డిపార్టీ అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటివరకు కుల ధ్రువీకరణ పత్రాలపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదన్నారు. వచ్చే క్యాబినెట్ సమావేశంలో తమ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రసాదం ఏడుకొండలు, జిల్లా ఉపాధ్యక్షులు సిరిగిరి శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి టేకు నరసింహస్వామి, భైలుపాటి దోమయ్య, భైలుపాటి పిచ్చయ్య, టేకు బోగేసు, చెన్నూరి దానయ్య, వీర్నపల్లి వెంకటరత్నం, కుమారి, జయరాజు పాల్గొన్నారు.

అధ్వానంగా పెనుమంట్ర - జుత్తిగ రోడ్డు..!

ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - పెనుమంట్ర



అధ్వానంగా ఉన్న పెనుమంట్ర నుండి జుత్తిగ వెళ్లే రోడ్డు

పెనుమంట్ర నుంచి జుత్తిగ వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. సుమారు ఏడేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రహదారిపై అడుగడుగునా గోతులు ఏర్పడి, రాళ్లు పైకి లేచి ఉన్నా అధికారులుగానీ, పాలకులు గానీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు గుండా ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు మూడు కిలోమీటర్ల పొడువునా ఇదే పరిస్థితి. రహదారికి ఇరువైపులా ఆక్వా సాగు ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. అలాగే నెలమూరు నుంచి కొమ్ముచిక్కాల, మడుగు పోలవరం వెళ్లే రహదారి లింకు రోడ్డు కూడా అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

విద్యార్థులు ఏకాగ్రత పెంచుకోవాలి



హిప్నోథెరపిస్టు పద్మాకమలాకర్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు ఏకాగ్రత పెంచుకోవాలని ప్రముఖ సైకాలజిస్టు, హిప్నోథెరపిస్ట్ డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ తెలిపారు. వైఎన్ కళాశాల, ఐక్యూ ఎసి, హెచ్‌ఆర్‌డి సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ, స్టేజ్ హిప్నోటిజం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హిప్నో థెరపిస్ట్ హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి లోనై, పరీక్షలను సరిగ్గా రాయక కుంగుబాటుకు గురవుతారన్నారు. అలాంటి సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. క్షమా గుణం అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత, మంచి గుణం ఏర్పడుతుందని తెలిపారు. మరో సైకాలజిస్ట్ డాక్టర్ పి.రమేష్ కుమార్, కళాశాల కార్యదర్శి చినమిల్లి సత్యనారాయణ రావు మాట్లాడుతూ పద్మా కమలాకర్ తొలి మహిళా హిప్నాటిస్ట్‌గా మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా అవార్డు పొందారని తెలిపారు. ఎంతో మందికి హిప్నటైజ్ ద్వారా వైద్యం అందించారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనం తరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సిహెచ్.కనకారావు అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరత్నం, పీజీ డైరెక్టర్ నిమ్మల చింతారావు, కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోళ్లు నిలిపివేత దారుణం : ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పండిన ప్రతి గింజా కొంటామని జగన్ చెబుతున్నారని, అయితే వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైస్ మిల్లుల్లో ఉండాల్సిన ధాన్యం రోడ్లపై, ట్రాక్టర్లపై ఉందని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలో తాను పర్యటించినప్పుడు రోడ్లపై రైతులు తమ బండ్లు, ట్రాక్టర్లతో బారులు తీరారని, వారిని అడిగితే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ఆపి 10 రోజులైందని చెప్పారని తెలిపారు. 10 రోజుల క్రితమే ధాన్యం లక్ష్యం పూర్తయ్యిందని, ఇక ధాన్యం కొనుగోలు చేయబోమని అధికారులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారని చెప్పారు. ఏం చేయాలో తెలియక, లోడు దింపుకోలేక, రైస్ మిల్లుకు పంపలేక, ట్రాక్టర్ టైర్ల మీద లోడు పడకుండా జాకీలు పెట్టుకొని, 10 రోజులుగా ధాన్యం అమ్ముకోలేని దయనీయ పరిస్థితుల్లో ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడం అమానుషమని విమర్శించారు.

జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి - వీరవాసరం



నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు

ఇబిసి రిజర్వేషన్‌ను రద్దు చేసిన వివిధ కులాల జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాంగ అవకాశాలు కల్పించాలని జాతీయ బిసి ప్రజా సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సంఘం నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశాన్ని వీరవాసరంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కుక్క సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు మాట్లాడారు. అన్ని రంగాల్లో బిసిలకు అన్యాయం జరుగుతోందన్నారు. రాజకీయంగా అణగదొక్కబడుతోంది ఒక్క బిసిలేనని తెలిపారు. ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధించుకోవచ్చన్నారు. బిసిలకు ప్రభుత్వ రంగా అన్యాయం జరిగితే కమిషన్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం పొందొచ్చన్నారు. త్వరలో జరగబోయే దేశ జన గణను కులాల వారీగా నిర్వహించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యతో పాటు ఆర్థికంగా బలపడిననాడే బిసిలు మరింత అభివృద్ధి సాధించొచ్చన్నారు. అనంతరం వీరవాసరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా న్యాయ విభాగం అధ్యక్షుడుగా పాలా శ్రీనివాసరావు, వీరవాసరం మండల అధ్యక్షుడుగా పాలా మహేంద్ర, కార్యదర్శిగా కవురు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా పాలా కిరణ్‌బాబు, జిల్లా మహిళ అధ్యక్షురాలుగా మల్లుల వరలక్ష్మిని ఎన్నుకున్నారు.

ప్రధానోపాధ్యాయిని నాగజ్యోతి సస్పెన్షన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని గూట్లపాడు ఎంపిపి మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.నాగజ్యోతిని సస్పెన్షన్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు నాగజ్యోతి ఉపాధ్యాయులను దూషిస్తూ వారితో దురుసుగా ప్రవర్తిస్తూ కులం పేరుతో విమర్శిస్తూ గ్రామంలో రాజకీయ విభేదాలు సృష్టిస్తున్నారని, కులప్రాతిపదికన గ్రామస్తులను వేరు చేయడానికి ప్రయత్నించారని, ఆమె ప్రవర్తనా విధానం చాలా అసభ్యంగా ఉంటుందని వచ్చిన అభియోగాలపై జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఈ నెల 19న విధుల నుంచి సస్పెన్షన్ చేసినట్లు ఆర్.వెంకటరమణ తెలిపారు.

పాలమూరులో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని పాలమూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో డాక్టర్ నవ్య జీవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ప్రజలందరూ కూడా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దరిచేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పి కల్యాణి, ఎఎన్ఎం శారా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాల్లో కృష్ణసాయివర్షిత ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు రూరల్



కృష్ణసాయివర్షితను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కర్ణాటకలోని హుబ్లీ ధర్వాడ ప్రాంతాల్లో నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల్లో ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ పరిధిలోని ఎన్ఎస్ఎస్ విభాగంలో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల విద్యార్థి అడపా కృష్ణసాయివర్షిత పాల్గొని రాక్ క్లైంబింగ్, స్కూబా డ్రైవింగ్, మౌంటేన్ బైకింగ్, ఫాస్ట్ బోటింగ్, సివిల్ ఏవియేషన్, రోప్ వాకింగ్‌లో ఏ ప్లస్ గ్రేడ్‌ను సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. యోగాథాన్ 2022లో గిన్నీస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ గెలుపొంది, నేషనల్ యూత్ సమ్మిట్‌లో పాల్గొనడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా కృష్ణసాయివర్షితను కళాశాల వ్యవస్థాపకులు కరెస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, పరిపాలనాధికారి డాక్టర్ డి.సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ జి.రమ్య, సిహెచ్.రమేష్‌బాబు అభినందించారు.

సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ భీమవరం డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుండి భారతదేశం విముక్తి కోసం అనేక పోరాటాలు చేశారని, బానిసత్వం బతుకులు వద్దని స్వాతంత్ర్యం ఒకరు ఇస్తే తీసుకునేది కాదని, మనమే స్వాతంత్ర్యం ప్రకటించుకోవాలని పోరాడిన మహా వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని పేర్కొన్నారు. ఇతర దేశాల్లో ఉండి సైన్యాన్ని ఏర్పరచి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించారని తెలిపారు. అప్పుడే బ్రిటిష్ వారు భయపడి స్వాతంత్ర్యం ప్రకటించారని పేర్కొన్నారు. అలాంటి మహనీయుని జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిం చాలని, భీమవరంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆఫీసు లో కూడా ఘనంగా జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

అసెంబ్లీకి రాకుండా ఉండేందుకే చంద్రబాబు డ్రామా

మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

అసెంబ్లీ సమావేశాలకు వస్తే గతంలో చేసిన తప్పులపై అధికార పక్షం ఎంఎల్ఎలు నిలదీస్తారనే భయంతో అసెంబ్లీకి రాకుండా ఎగ్గొట్టడానికే చంద్రబాబు ఏడుపు డ్రామా ఆడారని ఉప ముఖ్యమంత్రి దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మండలంలోని కడియద్ద గ్రామంలో వరుసగా మూడో రోజు శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడియద్ద గ్రామంలో ఇంటింటికి వెళ్తుంటే సంక్షేమ పథకాలపై ప్రజలంతా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ఇతర రాష్ట్రాల నుంచి బృందాలను పంపి వారి వారి రాష్ట్రాల్లో కూడా అమలు చేయడానికి అక్కడి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని వదులుకోవడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ముత్యాల ఆంజనేయులు, వైసిపి మండల అధ్యక్షులు, కొమ్ముగూడెం సొసైటీ ఛైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్ కుమార్, కడియద్ద గ్రామ సర్పంచి, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలకు కష్టాలే : టిడిపి

ప్రజాశక్తి - మొగల్తూరు



మొగల్తూరులో....

ప్రస్తుత ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు విమర్శించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి పెద్ద పల్లవపాలెంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో ప్రజలకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బస్వాని ఏడుకొండలు, కలిదిండి కుమార్‌బాబు, కత్తిమండ ముత్యాలరావు, మామిడిశెట్టి సత్యనారాయణ, పంపన శ్రీకృష్ణ భగవాన్, పాల రాంబాబు, కొల్లాటి భోగరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని తంకలకోడేరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఎంఎల్ఎ డాక్టర్ నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఊరికి వెళ్లినా ట్రాక్టర్లు ధాన్యంతో రోడ్లపై బార్లు తీరి ఉండడం చూస్తున్నామన్నారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వైసిపి పాలనతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధాన్యం లోడు దింపుకోలేక, రైస్ మిల్లుకు పంపలేక, ఆపి ఉంచిన ట్రాక్టర్ టైర్ల మీద లోడు పడకుండా జాకీలు పెట్టుకొని వారం పది రోజులుగా ధాన్యం అమ్ముకోలేనటువంటి దయనీయ పరిస్థితుల్లో రైతులు వాపోతున్నారన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆఖరి ధాన్యం గింజ కూడా కొంటామని చెబుతున్నారని, వాస్తవంలోకి వచ్చి చూస్తే గ్రామాల్లో రైతులు ధాన్యం ఎలా అమ్ముకోవాలో తెలియని స్థితిలో ఉన్నారన్నారు. మొన్నటిదాకా ధాన్యం అమ్ముకోవాలంటే పలు నిబంధనలు పెట్టారని, సంచులు లేవన్నారన్నారు. ఇప్పుడు టార్గెట్లు పూర్తయ్యాయని ధాన్యం కొనుగోలు నిలిపివేయడం అమానుషమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సెక్రటరీ పాములరజని కుమార్, సర్పంచి చొప్పల రజని, గ్రామ ఇన్‌ఛార్జి నెక్కంటి ఆదినారాయణ, గ్రామ పార్టీ సెక్రటరీ కుడక కోటేశ్వరరావు, తాళ్లూరి విజయలక్ష్మి, అందే కోటి వీరభద్రం, కలిదిండి రామచంద్రరాజు, ఎంపిటిసి సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

వైసిపి సేవాదళ్ మండల కన్వీనర్‌గా సుగుణరాజు

ప్రజాశక్తి - ఆచంట



ఇంజేటి సుగుణరాజు

మండల వైసిపి సేవాదళ్ కన్వీనర్‌గా కొడమంచిలి పంచాయతీ పరిధి టి.మెరకకు చెందిన ఇంజేటి సుగుణరాజును నియమించారు. ఈ సందర్భంగా సుగుణ రాజును సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, వైసిపి నాయకులు అభినందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన తనకు సేవాదళ్ కన్వీనర్ పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి - తణుకు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తణుకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవ్ కుమార్ అన్నారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో వాహనదారులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే భారీ జరిమానా విధిస్తామన్నారు. వాహనదారులు సీటు బెల్టు ధరించాలని, పరిమితికి మించి వాహనాల్లో ఎక్కువ మందిని ఎక్కించుకోకూడదని తెలిపారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ వాసు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ వద్ద అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు కనీసం పండుగ రోజుల్లో కూడా నిత్యావసర వస్తువులు ఉచితంగా అందజేయ లేదని, దీంతో అన్నా క్యాంటీన్ వద్ద పేదలు తృప్తిగా భోజనం చేస్తున్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు ట్యాక్సీ స్టాండ్ వద్ద అన్నా క్యాంటీన్లో 761వ రోజు బాలం వరలక్ష్మి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పేదలకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్రంలో మూసివేసిన అన్నా క్యాంటీన్లను తిరిగి తెరవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి కుటుంబ సభ్యులతో పాటు జివి, పాలవలస తులసీరావు, మేడిశెట్టి కేశవ, కలిశెట్టి అప్పారావు, రాజా పాల్గొన్నారు.

కోర్టు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సీనియర్ న్యాయవాదులు, ఐలు పట్టణ కార్యదర్శి పుట్టా వేణుగోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్‌లో కోర్టు క్యాలెండర్, జేబు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 1పై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ జిఒ ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేల ఉందన్నారు. రాజ్యాంగంలో పౌరుల హక్కులకు భంగం కలిగించే అధికారం ఎవరికీ లేదని, జిఒ 1 సమర్థవంతం కాదని తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

నిజమైన పేదలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తారని, వారికి తగిన వైద్యం అందించి మందులు అందించాలని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బంగారు వారి చెరువుగట్టు, వీవర్స్ కాలనీల్లో నూతనంగా ఎంపికైన తొమ్మిది మంది ఆశావర్కర్లు శుక్రవారం పాలకొల్లు వైసిపి కార్యాలయంలో కవురు శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, మానుకోండ శ్రీనుబాబు పాల్గొన్నారు.